క్లుప్తంగా

బీటీ రెన్యువల్ పనులు చేపట్టాలని ఆందోళన



ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

అర్వపల్లి : మండల పరిధిలోని కొత్తగూడెం గ్రామానికి వెళ్లే బీటీరోడ్డుకు రెన్యువల్ పనులు వెంటనే చేపట్టాలని కోరుతూ గ్రామస్తులు మంగళవారం రోడ్డుపై ఆందోళన వ్యక్తం చేశారు. బీటీ రెన్యువల్‌కు నిధులు మంజూరై ఏడాది దాటినా ఇంతవరకు పనులు ప్రారంభించడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే టెండర్ ప్రక్రియ పూర్తిచేసి బీటీ రెన్యువల్ చేసి తమ ఇబ్బందులను తీర్చాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం రోడ్డు పూర్తిగా దెబ్బతిన్న రాకపోకలు సాగించలేక నిత్యం అవస్థలు పడుతున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో రామసాని రవీందర్, కోటి, మేడిపల్లి నర్సయ్య, మంగమ్మ, ఉప్పమ్మ, స్వప్న, రాధ తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో జీలుగ విత్తనాలు

మద్దిరాల : మండల కేంద్రంలోని అగ్రోస్ రైతు సేవా కేంద్రంలో సబ్సిడీపై జీలుగ విత్తనాలు రైతులకు అందుబాటులో ఉంచినట్లు మండల వ్యవసాయ అధికారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని మండల రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అర్వపల్లి : మండల కేంద్రంలోని పీఏసీఎస్ కార్యాలయంలో రైతులకు అందుబాటులో జీలుగ విత్తనాలు ఉంచినట్లు చైర్మన్ కుంట్ల సురేందర్‌రెడ్డి, సీఈఓ మేడబోయిన రామస్వామి మంగళవారం తెలిపారు. మొదటి విడతగా పీఏసీఎస్‌కు 133 బస్తాల జీలుగ విత్తనాలు వచ్చాయని, 30కిలోల బస్తా ప్రభుత్వ సబ్సిడీ పోను రూ.843చొప్పున విక్రయిస్తున్నట్లు తెలిపారు. కావాల్సిన రైతులు ఆధార్‌కార్డు, పట్టాదార్ పాస్‌పుస్తకం జిరాక్స్ ప్రతులను వెంట తీసుకురావాలని కోరారు.

కుటుంబానికి పరామర్శ



దేవయ్యను పరామర్శిస్తున్న జెడ్పీటీసీ జీడి భిక్షం, బీఆర్ఎస్ నాయకులు

సూర్యాపేట రూరల్ : మండల పరిధిలోని కాసరబాద గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు చింత దేవయ్య భార్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. దీంతో సూర్యాపేట జెడ్పీటీసీ జీడి భిక్షం, వైస్ ఎంపీపీ రామసాని శ్రీనివాస్‌నాయుడు మంగళవారం కాసరబాదలో దేవయ్యను పరామర్శించి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. వారి వెంట నాయకులు బంటు సైదులు, కొల్లు నరేష్, ఎల్లయ్య, తిరుమల్ తదితరులు పాల్గొన్నారు.

లింగ వివక్ష, బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన



మాట్లాడుతున్న సీహెచ్‌ఓ బిచ్చునాయక్

తిరుమలగిరి (తుంగతుర్తి) : మున్సిపాలిటీ పరిధిలోని మాలిపురం గ్రామంలో మార్పు సొసైటీ ఆధ్వర్యంలో మంగళవారం లింగ వివక్ష, బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీహెచ్‌ఓ బిచ్చునాయక్ పాల్గొని మాట్లాడారు. బాలికల పట్ల వివక్ష చూపరాదని, స్త్రీ, పురుషులు సమానమేనని అన్నారు. కార్యక్రమంలో పోరెళ్ల విప్లవకుమార్, స్వరూపాకుమారి, లలిత, పద్మ, చంద్రకళ, శారద, విమల, చైతన్య, రజిత తదితరులు పాల్గొన్నారు.

రూ.2.40 కోట్లతో బీటీ రెన్యువల్ పనులు



రెన్యువల్ చేసిన బీటీ రోడ్డు

అర్వపల్లి : టేకుమట్ల–కుంచమర్తి క్రాస్‌రోడ్డు రహదారిలో భాగంగా సూర్యాపేట మండలం రామచంద్రాపురం నుంచి జాజిరెడ్డిగూడెం మండలంలోని కుంచమర్తి క్రాస్‌రోడ్డు వరకు ఆర్‌అండ్‌బీ రోడ్డు దెబ్బ తినడంతో బీటీ రెన్యువల్ పనులను చేపట్టారు. రామచంద్రాపురం నుంచి కుంచమర్తి క్రాస్‌రోడ్డు వరకు 6.2 కిలోమీటర్ల రోడ్డును రూ.2.40 కోట్లతో బీటీ రెన్యువల్ చేశారు. అలాగే ఈ నిధులతో రామచంద్రాపురం గ్రామంలో 4వందల మీటర్ల సీసీరోడ్డును నిర్మిస్తున్నట్లు ఆర్‌అండ్‌బీ ఏఈఈ డి.యుగంధర్ మంగళవారం తెలిపారు. కాగా టేకుమట్ల నుంచి రామచంద్రాపురం వరకు సింగిల్ రోడ్డును డబుల్ రోడ్డుగా గతంలో విస్తరించారు. మిగిలిన రామచంద్రాపురం నుంచి కుంచమర్తి క్రాస్‌రోడ్డు వరకు సింగిల్ రోడ్డును డబుల్ రోడ్డుగా విస్తరించాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

నిరుపయోగంగా నీటితొట్లు..!

- వేసవిలో తాగునీటికి అల్లాడుతున్న మూగజీవాలు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు
- వినియోగంలోకి తీసుకురావాలని రైతుల వేడుకోలు



అనిరెడ్డిగూడెం గ్రామశివారులో నిరుపయోగంగా ఉన్న నీటితొట్టి



నూర్జహాన్‌పేట గ్రామ శివారులో నీటితొట్టిలో పెరిగిన పిచ్చిమొక్కలు

పెన్‌పహాడ్ : మూగజీవాల దాహార్తిని తీర్చడానికి ప్రభుత్వం గ్రామాల్లో నిర్మించిన నీటితొట్లు నిర్వహణ కొరవడడంతో నిరుపయోగంగా మారాయి. అధికారులు, ప్రజాప్రతినిధులు నీటి తొట్ల నిర్వహణను మరిచిపోవడంతో రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన తొట్లు ప్రస్తుతం గ్రామాల్లో సగానికి పైగా నిరుపయోగంగా మారడమే కాకుండా కొన్ని చోట్ల ధ్వంసమయ్యాయి. మరికొన్ని చోట్ల చెత్తాచెదారంతో నిండి చెట్ల పొదల మధ్య కూరుకుపోయాయి. ప్రస్తుత వేసవిలో ఎండలు మండిపోతున్న తరుణంలో పొలాలకు మేతకు వెళ్లిన మూగజీవాలకు సాయంత్రం ఇంటి వచ్చే సమయంలో గ్రామాల చివరలో ఏర్పాటు తొట్లలో నీరు లేక గోసపడుతున్నాయి. చెరువులు, కుంటలు, బోరుబావులు దగ్గరకు నీళ్ల కోసం వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది.

ఉపాధిహామీలో ఆరేళ్ల క్రితం ఏర్పాటు..

వేసవిలో మూగజీవాలు దాహంతో అల్లాడకూడదనే లక్ష్యంతో ఆరేళ్ల క్రితం ఉపాధి హామీ పథకం కింద గ్రామాల్లో రూ.లక్షలు వెచ్చించి ఆయా గ్రామాల శివార్లలో నీటితొట్లను నిర్మించారు. ప్రతి గ్రామానికి నాలుగైదు ప్రదేశాల్లో మూగజీవాల దాహార్తి కోసం నీటితొట్లు నిర్మించారు. కాని వాటి నిర్వహణ మర్చడంతో నీటి తొట్లలో నీరు లేక పగుళ్లుబారుతున్నాయి. నీటి సౌకర్యం ఉన్న చోటనే తొట్లు నిర్మించామని అధికారులు చెబుతున్నా నీటి వసతి కల్పించడంలో నిర్లక్ష్యం చేస్తున్నారు. బోరుమోటర్లు చెడిపోయి పైప్‌లైన్ మరమ్మతులు చేయకపోవడం, విద్యుత్ సౌకర్యం లేకపోవడంతో నీటితొట్లు నిరుపయోగంగా మారుతున్నాయి. దీంతో ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతోంది.

వినియోగంలోకి తెస్తేనే మేలు..

గ్రామాల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రత్యేక చొరవ చూపి చిన్నపాటి మరమ్మతులతో నీటి తొట్లను వినియోగంలోకి తెచ్చే అవకాశం ఉంది. ఇప్పటికైనా గ్రామపంచాయతీ అధికారులు, ఆర్‌డబ్ల్యూఎస్, పశుసంవర్ధక శాఖ అధికారులు స్పందించి మూగజీవాల దాహార్తి తీర్చేందుకు చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల రైతులు కోరుతున్నారు.

నిర్వహణను అధికారులు పట్టించుకోవాలి



నీటితొట్ల నిర్వహణను అధికారులు, ప్రజాప్రతినిధులు గాలికొదిలేశారు. వాటి పట్ల నిర్లక్ష్యం వహించడంతో పూర్తిగా ధ్వంసమవుతున్నాయి. దీంతో నీటి కోసం మూగజీవాలు వేసవిలో అల్లాడిపోతున్నాయి. ఇప్పటికైనా అధికారులు నీటి సౌకర్యం కల్పించి వినియోగంలోకి తీసుకురావాలి. ధ్వంసమైన నీటితొట్లకు మరమ్మతులు చేయించాలి.

– వీరబోయిన రవి, నాగులపాటి అన్నారం

వినియోగంలోకి తెచ్చేందుకు చర్యలు తీసుకుంటాం



ఉపాధిహామీ పథకంలో భాగంగా నిర్మించిన నీటి తొట్ల నిర్వహణ బాధ్యత గ్రామ పంచాయతీలదే. నిరుపయోగంగా మారిన నీటితొట్లను వినియోగంలోకి తెచ్చే విధంగా పంచాయతీ అధికారులకు ఆదేశాలిస్తాం. మరమ్మతుల విషయంపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం.

– బాణాల శ్రీనివాస్ ఎంపీడీఓ

గీత బీమా దరఖాస్తు గడువును పొడిగించాలి

ఆత్మకూర్ (ఎస్) : గౌడ కులస్తులకు, గీత కార్మికులకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయనున్న గీత బీమా దరఖాస్తు గడువును పొడిగించాలని గౌడ జనహక్కుల పోరాట సమితి జిల్లా ఉపాధ్యక్షుడు బిక్కి బుచ్చయ్యగౌడ్ మంగళవారం ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గౌడ కులస్తులకు బీమా పథకం వివరాలను ఎక్సైజ్ శాఖ అధికారులు వివరించకపోవడంతో అవగాహన లేదని, ఎక్సైజ్ శాఖ ఉన్నతాధికారులు ప్రతి గ్రామంలో గౌడ కులస్తులకు బీమా పథకం పట్ల అవగాహన కల్పించి బీమా దరఖాస్తుకు కావలసిన పత్రాలను తీసుకోవాలని వారు కోరారు. అవగాహన కల్పించకుండానే గడువు ముగిసే పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. గడువు పొడిగించుకుంటే గౌడ కులస్తులు పూర్తిగా నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. కార్యక్రమంలో గౌడ జనహక్కుల పోరాట సమితి మండల అధ్యక్షుడు జలగం మల్లేష్, జిల్లా ఉపాధ్యక్షుడు దంతూరి సోమన్న, సతీష్, గునిగంటి భిక్షం, లింగయ్య, వెంకన్న తదితరులు ఉన్నారు.

నూతనకల్ : గీత కార్మికులకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న గీత బీమా పథకం దరఖాస్తు గడువును పొడగించాలని గౌడ జనహక్కుల పోరాట సమితి జిల్లా ఉపాధ్యక్షుడు బిక్కి బుచ్చయ్యగౌడ్ ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీమా పథకం వివరాలను ఎక్సైజ్ శాఖ అధికారులు పూర్తిస్థాయిలో వివరించకపోవడంతో బీమాపై అవగాహన లేక చాలా మంది గీత కార్మికులు బీమాకు దరఖాస్తు చేసుకోలేదని ఆయన తెలిపారు. అధికారులు స్పందించి బీమా దరఖాస్తుపై అవగాహన కల్పించడంతో పాటు దరఖాస్తు గడువును పొడగించాలని ఆయన కోరారు. సమావేశంలో గౌడ జన హక్కుల పోరాట సమితి మండల అధ్యక్షుడు పులుసు లింగమల్లయ్య, మొగుళ్ల వెంకన్న తదితరులు ఉన్నారు.

ఘనంగా విగ్రహాల ప్రతిష్ఠాపనోత్సవాలు



పూజల్లో పాల్గొన్న ప్రజలు

పెన్‌పహాడ్: మండల పరిధిలోని దూపహాడ్ గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ సీతారామచంద్ర పరమేశ్వర దుర్గామాత దేవాలయంలో విగ్రహాల ప్రతిష్ఠాపనోత్సవాల్లో భాగంగా మంగళవారం మహాయజ్ఞం నిర్వహించారు. ఈ సందర్భంగా గణపతి పూజ పుణ్యాహవచనం, వాస్తుపూజ, వాస్తు హోమం, వాస్తు పరిషత్మీకరణ పంచగవ్య అగ్నిమధనం, మల్లాది హోమం, అష్టసితి హోమం, పీఠ పూజలు నిర్వహించారు. నేడు గ్రామంలోని పుర వీధుల్లో దేవతామూర్తుల విగ్రహాలను ఊరేగింపు నిర్వహించి జలబిందెలతో జలాభిషేకం నిర్వహించనున్నారు. జూన్ 1న ధ్వజస్తంభం, విగ్రహాల ప్రతిష్ఠ నిర్వహించనున్నారు. కార్యక్రమంలో శ్రీరామ మాల ధారణ స్వాములు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఘనంగా సంతోషిమాత బ్రహ్మోత్సవాలు



సంతోషిమాత ఆలయంలో బ్రహ్మోత్సవాలకు హాజరైన భక్తులు

భానుపురి (సూర్యాపేట) : పట్టణంలోని సంతోషిమాత దేవాలయం ప్రతిష్ఠించబడి 28ఏళ్లు పూర్తయిన సందర్భంగా మంగళవారం శ్రీసంతోషిమాత బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయ ప్రధాన అర్చకుడు ఇరువంటి శివరామకృష్ణ తెల్లవారుజామున శ్రీసంతోషిమాత, సత్యసాంబశివుడు, లక్ష్మీగణపతి, ఆంజనేయ స్వామి, సంతాన నాగదేవతలకు ప్రత్యేక పంచామృత అభిషేకం నిర్వహించారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా కలశస్థాపన పూజ, పుణ్యాహవాచనం, మండప ఆరాధన పూజలు చేశారు. లక్ష్మీగణపతి, రుద్ర, లలితా హోమం, మహా పూర్ణాహుతి చేపట్టారు. అమ్మవారికి కుంకుమార్చన, గాజుల పూజ, పసుపు కొమ్ముల పూజ, మల్లెల పూజ నిర్వహించారు. శ్రీసంతోషిమాతకు త్రిభువన మహాసామ్రాజ్య పట్టాభిషేకం చేసి మహాదాశీర్వచనం నిర్వహించారు. కార్యక్రమంలో దేవాలయ అధ్యక్ష, కార్యదర్శులు నూకా వెంకటేశంగుప్త, బ్రహ్మాండ్లపల్లి మురళీధర్, కోశాధికారి పాలవరపు రాంమూర్తి, కమిటీ సభ్యులు బెలిదె అశోక్, తిరునగరు యాదగిరి, తాళ్లపల్లి రామయ్య, బ్రాహ్మణపల్లి బ్రహ్మయ్య, సోమా శ్రీశైలం, యామా వెంకటేశ్వర్లు, బొనగిరి విజయ్‌కుమార్, గోపాల్‌రెడ్డి, ఆలయ అర్చకులు భట్టారం వంశీకృష్ణశర్మ, దరూరి కృష్ణమాచార్యులు, గోమటం రాఘవాచార్యులు, దేవాలయ మేనేజర్ బచ్చు పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవం



తుంగతుర్తి : సీఐటీయూ జెండావిష్కరణ చేస్తున్న సంఘం నాయకులు



పెన్‌పహాడ్ : సీఐటీయూ జెండా ఎగురవేస్తున్న రణపంగ కృష్ణ

తుంగతుర్తి : మండల కేంద్రంలో సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను మంగళవారం బిల్డింగ్ వర్కర్స్, కన్‌స్ట్రక్షన్ యూనియన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బిల్డింగ్ వర్కర్స్ రాష్ట్ర కార్యదర్శి కోటంరాజు సంఘం జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. కార్మికులు పోరాడి సాధించుకున్న చట్టాలను కేంద్ర ప్రభుత్వం రద్దు చేయవద్దని అన్నారు. భవన నిర్మాణ కార్మికులకు పని భద్రత కల్పించాలని, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని, పనికి తగిన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్మికులంతా ఐక్యంగా ఉండి తమ హక్కు సాధనకు ఉద్యమించాలన్నారు. కార్మికుల హక్కుల సాధనకు నిరంతరం సీఐటీయూ పోరాడుతుందన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బుర్ర శ్రీనివాస్, ఎలుక సోమయ్య, మల్లేపాక నగేష్, మన్సూర్‌అలీ, రమేష్, ప్రభాకర్, అబ్బాస్, కొమరయ్య, శేఖర్, సతీష్, శివ, ఎల్లయ్య, ఫకీర్, ఖాసీం, లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల చట్టాలను కాలరాస్తున్న కేంద్రం

పెన్‌పహాడ్ : కార్మికులు పోరాడి సాధించుకున్న 44చట్టాలను కేంద్ర ప్రభుత్వం కాలరాస్తుందని, దీంతో కార్మికులు వీధిన పడే పరిస్థితి ఉందని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు రణపంగ కృష్ణ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సంఘం జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడారు. కార్పొరేట్ శక్తులకు కొమ్ము కాస్తూ నిరుద్యోగ సమస్యను పెంచారని అన్నారు. కేంద్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ సంస్థలను బడా పెట్టుబడుదారులకు తాకట్టు పెట్టిందని తెలిపారు. కార్యక్రమంలో హమాలీ సంఘం అధ్యక్షుడు కోట సైదులు, ఒగ్గు నాగయ్య, జానయ్య, శంకర్, ఉపేందర్, బక్కయ్య, రాములు తదితరులు పాల్గొన్నారు.

పాత కేంద్రం తరలింపు.. కొత్త కేంద్రం ఏర్పాటు



అర్వపల్లి సబ్‌స్టేషన్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతుల కేంద్రం

అర్వపల్లి : నియోజకవర్గంలోని 6మండలాల రైతులకు అర్వపల్లిలో ఎంతోకాలంగా సేవలందిస్తున్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతు కేంద్రాన్ని తుంగతుర్తి నియోజకవర్గ కేంద్రానికి మంగళవారం మార్చారు. 24ఏళ్ల కిందట స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేసి సేవలందిస్తున్నారు. నియోజకవర్గంలోని తుంగతుర్తి, తిరుమలగిరి, జాజిరెడ్డిగూడెం, నూతనకల్, మద్దిరాల, నాగారం మండలాల రైతులు ఈ కేంద్రంలోనే ట్రాన్స్‌ఫార్మర్లను మరమ్మతు చేయించుకునేవారు. ఇటీవల కొత్తగా నాగారం విద్యుత్ సబ్‌డివిజన్ ఏర్పాటు కావడంతో ఈసబ్ డివిజన్‌కు కూడా అదనంగా మరో ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతు కేంద్రాన్ని ప్రభుత్వం మంజూరు చేసింది. దీంతో అర్వపల్లిలోని పాత మరమ్మతు కేంద్రాన్ని తుంగతుర్తికి తరలించి, నాగారం సబ్‌డివిజన్‌కు మంజూరైన అదనపు కేంద్రాన్ని అర్వపల్లిలో ఏర్పాటు చేశారు. కాగా అర్వపల్లి మరమ్మతు కేంద్రం కింద తిరుమలగిరి, నాగారం, జాజిరెడ్డిగూడెం మండలాలు, తుంగతుర్తిలో ఏర్పాటు చేసిన మరమ్మతు కేంద్రం ద్వారా తుంగతుర్తి, నూతనకల్, మద్దిరాల మండలాల రైతులకు సేవలు అందించనున్నారు.

రైతులకు పంట నష్టపరిహారం చెల్లించాలి

నాగారం : అకాల వర్షాలకు పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం వెంటనే పంట నష్టపరిహారం చెల్లించాలని సీపీఎం మండల కారదర్శి కడియం కుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఇటీవల అకాల వర్షాలకు వరి, మామిడి, నిమ్మ పంటలు దెబ్బతిని రైతులు తీవ్రంగా నష్టపోయారని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పంట నష్టపోయిన రైతులకు పంట నష్టపరిహారం చెల్లిస్తామని ప్రకటించి నెల రోజులు గడుస్తున్నా నేటికి రైతులకు నష్టపరిహారం ఇవ్వలేదన్నారు. వర్షాలకు తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేసి, మద్దతు ధర చెల్లించాలన్నారు. ఆయన వెంట పార్టీ నాయకులు గుడపూడి వెంకటేశ్వర్లు, కందె భిక్షం, పుల్లయ్య, అంజయ్య, రాములు, మారయ్య, యాదమ్మ, సైదులు, స్వరూప తదితరులు ఉన్నారు.

హక్కుల ఉల్లంఘనకు పాల్పడితే కఠిన చర్యలు



సూర్యాపేట రూరల్ : సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ జీడి భిక్షం



పెన్‌పహాడ్ : సమావేశంలో మాట్లాడుతున్న ఆర్ఐ స్వప్న



నాగారం : పౌరహక్కులపై అవగాహన కల్పిస్తున్న డిప్యూటీ తహసీల్దార్ షాహిన్‌బేగం

పెన్‌పహాడ్ : భారత రాజ్యాంగం ప్రతిపౌరుడికి కల్పించిన హక్కుల ఉల్లంఘనకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఆర్ఐ స్వప్న అన్నారు. మంగళవారం మండల పరిధిలోని పొట్లపహాడ్ గ్రామంలో నిర్వహించిన పౌరహక్కుల దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన గ్రామసభలో ఆమె పాల్గొని మాట్లాడారు. సమాజంలో కులమతాలకు అతీతంగా ప్రతిఒక్కరూ కలిసిమెలిసి జీవించాలన్నారు. మత సంప్రదాయాలను కాపాడుతూ శాంతియుత వాతావరణంలో జీవించాలని ఆమె కోరారు. ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన ప్రజలను ఏ ఒక్కరూ కించపర్చినా చట్టపరమైన చర్యలు ఉంటాయన్నారు. దేవాలయ ప్రవేశానికి అన్ని కులాల వారు అర్హులేనన్నారు. ఎస్సీ, ఎస్టీ, అట్రాసిటీ చట్టాలతో పాటు ప్రతి అంశంపై ప్రజలు అవగాహన పెంపొందించుకోవాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ రామినేని పుష్పావతి, పంచాయతీ కార్యదర్శి విద్యాధర్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఇమాంపేటలో పౌర హక్కుల దినోత్సవం

సూర్యాపేట రూరల్ : పౌరులు తమ హక్కుల గురించి తెలుసుకొని వాటిని కాపాడుకోవాలని, రాజ్యాంగం కల్పించిన హక్కులపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగిఉండాలని, దళితులు చదువుల్లో రాణించాలని జెడ్పీటీసీ జీడి భిక్షం అన్నారు. మంగళవారం మండల పరిధిలోని ఇమాంపేట గ్రామంలో నిర్వహించిన పౌర హక్కుల దినోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం, సీఎం కేసీఆర్ చేపడుతున్న పలు సంక్షేమ పథకాలను దళితులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రామంలో ప్రజలందరూ కలిసి మెలసి ఉండాలని, గ్రామంలో ప్రశాంతమైన వాతావరణం ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ వెంకన్న, ఎంపీడీఓ శ్రీనివాస్‌రావు, వైస్ ఎంపీపీ రామసాని శ్రీనివాస్‌నాయుడు, సర్పంచ్ పాముల ఉపేందర్, ఎంపీటీసీ మామిడి కిరణ్, వైద్యాధికారిని శ్రీలేఖ, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

చట్టాలను సద్వినియోగం చేసుకోవాలి

నాగారం : రాజ్యాంగం కల్పించిన చట్టాలను సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ తహసీల్దార్ షాహిన్‌బేగం అన్నారు. మంగళవారం మండల పరిధిలోని డి.కొత్తపల్లి గ్రామంలో పౌరహక్కుల దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన గ్రామసభలో పాల్గొని మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీలు విద్యావంతులుగా ఎదగాలని కోరారు. పౌరుల స్వేచ్ఛకు భంగం కలిగించొద్దన్నారు. కుల వివక్ష లేకుండా అందరూ కలసి, మెలసి ఉండాలని, కులమతాలు, అంటరానితనం పట్ల వివక్ష చూపరాదని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం దళితుల సంక్షేమం కోసం అనేక పథకాలు అమలు చేస్తుందని వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఐ వెంకట్రాములు, సీనియర్ అసిస్టెంట్ ఉప్పలయ్య, పంచాయతీ కార్యదర్శి కొమ్ము అరుణ్, దేవరకొండ యాదగిరి, నగేష్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఆటోనగర్ నిర్మించొద్దని గ్రామస్తుల ధర్నా



ధర్నాలో పాల్గొన్న ఐలాపురం గ్రామస్తులు

చివ్వెంల(సూర్యాపేట) : మండల పరిధిలోని ఐలాపురం గ్రామ శివారులోని సర్వేనంబర్ 169 అసైన్డ్ భూమిలో ఆటో నగర్ నిర్మించొద్దని ఐలాపురం గ్రామస్తులు మంగళవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నాలుగు తరాలుగా తాము ఆ భూమిని నమ్ముకుని సేద్యం చేసుకుని జీవనం సాగిస్తున్నామని, ఖమ్మం–సూర్యాపేట జాతీయ రహదారి విస్తరణలో భాగంగా ఇప్పటికే ప్రభుత్వం కొంత భూమిని తీసుకుందని, మిగిలిన భూమిని తీసుకుంటే తమ జీవనం సాగేది ఎలా అని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఆటోనగర్ నిర్మాణ ఆలోచనను విరమించుకుని తమకు శాశ్వత పట్టాలు మంజూరు చేయాలని కోరారు. ఈ సందర్భంగా పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ రంగరావుకు అందజేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు బోడపట్ల శ్రీను, వినోద్‌కుమార్, జానకిరాములు, సైదులు, సాయిలు, వెంకన్న, అశోక్, నర్సయ్య, లింగయ్య, రత్తయ్య, భిక్షం, మదన్‌నాయక్, సుధాకర్, చంటి, సురేష్, తేజ, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాగర్జనను విజయవంతం చేయాలి

నూతనకల్ : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలో జూన్ 4న నిర్వహించే సీపీఐ ప్రజాగర్జనను విజయవంతం చేయాలని సీపీఐ మండల కార్యదర్శి తొట్ల ప్రభాకర్‌గౌడ్ కోరారు. మంగళవారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా సమస్యలను పరిష్కరించడంలో విఫలమయ్యాయని అన్నారు. కేంద్ర ప్రభుత్వ రంగసంస్థలను ప్రైవేటీకరణ చేయాలని తీసుకున్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలన్నారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. రైతులకు రుణమాఫీ, అర్హత కల్గిన వారందరికీ రేషన్‌కార్డులు అందించాలని, వంటగ్యాస్‌ను రూ.500లకే అందించాలని, ప్రజాగర్జనకు ప్రజలు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు మద్దెల రాంమ్మూర్తి, యానాల వెంకట్‌రెడ్డి, రవి తదితరులు పాల్గొన్నారు.

ఈదురుగాలులు.. అకాల వర్షం

అర్వపల్లి : అకాల వర్షాలు రైతులను ఇంకా వెంటాడుతునే ఉన్నాయి. మంగళవారం ఉదయం నుంచి మళ్లీ వర్షం మొదలైంది. దీంతో కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం రాశులు, ఎగుమతి కావాల్సిన ధాన్యం బస్తాలు తడిసి ముద్దవుతున్నాయి. మండల వ్యాప్తంగా కొనుగోలు కేంద్రాల్లో ఇంకా కాంటాలైన 21,295 బస్తాల ధాన్యం ఎగుమతి కావాల్సి ఉంది. ఇప్పటికి సుమారు 5.33లక్షల బస్తాల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. ఈదురు గాలులలో కురిసిన వర్షానికి బొల్లంపల్లి గ్రామంలో గద్దగూటి ముత్తయ్యకు చెందిన సిమెంట్ రేకుల ఇల్లు పూర్తిగా కూలిపోయింది. అలాగే అర్వపల్లిలోని యోగానందలక్ష్మీ నర్సింహస్వామి దేవాలయం, ప్రభుత్వ పాఠశాలలు జలమయమయ్యాయి.

తిరుమలగిరి (తుంగతుర్తి) : మున్సిపల్ కేంద్రంలో మంగళవారం చిరుజల్లులతో కూడిన వర్షం కురిసింది. ఈ వర్షానికి ఐకేపీ కొనుగోలు కేంద్రాల్లో కొన్ని చోట్ల ధాన్యం బస్తాలు తడిసి ముద్దయ్యాయి. ఒకేసారి వాతావరణం చల్లబడి వర్షం రావడంతో ధాన్యం రాశులపై రైతులు టార్పాలిన్లు కప్పి ఉంచారు. ఇప్పటికే నెల రోజులు దాటిందని, కొనుగోళ్ల ఆలస్యమవుతున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.



అర్వపల్లి : వర్షానికి జలమయమైన శ్రీయోగానంద లక్ష్మీనర్సింహస్వామి దేవాలయం



బొల్లంపల్లిలో వర్షానికి కూలిన ఇల్లు, పగిలిన రేకులు



తిరుమలగిరి : తొండ గ్రామంలో ధాన్యం బస్తాలపై టార్పాలిన్ కప్పుతున్న రైతు



తిరుమలగిరిలో కురుస్తున్న వర్షం